# తొలిపొద్దు

DIGITAL PAPER

ఎడిటర్ సుజిత్ రెడ్డి లింగాల

27-08-2024 మంగళవారం

సంపుటి : 1 | సంచిక : 133 | పేజీలు 4 | వెల : 5

Circulated in Hyderabad, Ranga Reddy, Adilabad, Nizamabad, Karimnagar, Warangal, Mahabubnagar, Nalgonda, Sangareddy, Khammam and Kurnool




WANTED

విలేకరులు కావలెను

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా? అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా? అనుభవజ్ఞులైన సీనియర్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో వెలువడుతున్న తొలిపొద్దు డిజిటల్ పేపర్‌కు రాష్ట్రవ్యాప్తంగా అనుభవం, ఆసక్తి ఉన్న జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్చార్జులు కావలెను.

వివరాలకు 9490675406, 9966463377

# ఇది మీ సర్కారు

నిరుద్యోగుల బాధలు బాగా తెలుసు

పదేళ్లపాటు వారిని తిప్పలు పెట్టారు

మేం వచ్చిన 3 నెలల్లో 30 వేల కొలువులు

త్వరలో మరో 35 వేల ఉద్యోగాల భర్తీ

సివిల్స్ క్లియర్ చేసిన 135 మందికి రూ. లక్ష సాయం

మెయిన్స్ క్లియర్ చేస్తే మరో మరో లక్ష అందిస్తాం

సివిల్ సర్వెంట్లుగా రాష్ట్రానికి వచ్చి సేవ చేయండి

అభయహస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సీఎం

2లో



# నెక్ట్స్ పీసీసీ చీఫ్ ఆయనే..



ఏ క్షణంలోనైనా ప్రకటన

సామాజిక సమీకరణాలే ప్రాతిపదిక

బీసీలకే అవకాశమన్న ఏఐసీసీ

ఏకాభిప్రాయంతో ముగిసిన ఎంపిక

ప్రచారంలో.. మహేష్ కుమార్ గౌడ్ పేరు

**హైదరాబాద్:** కాంగ్రెస్ పీసీసీ చీఫ్‌గా ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేరు ఖరారైందంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీనిపై రేపోమాపో అధికారిక ప్రకటన వెలువడవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. బీసీ సామాజిక వర్గం నుంచి పీసీసీ చీఫ్‌ను ఎంపిక చేయడం వెనుక కాంగ్రెస్ తీవ్ర కసరత్తు చేసినట్లు తెలుస్తోంది. భవిష్యత్తు రాజకీయ అవసరాల దృష్ట్యా కాంగ్రెస్ వెనుకబడిన వర్గాలకు చెందిన వ్యక్తిని ఈ పదవికి ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. తొలుత ఎస్సీ,ఎస్టీ, బీసీ అభ్యర్థుల పేర్లను పరిశీలించిన ఏఐసీసీ ఈసారి తెలంగాణలోని బీసీ వర్గానికి ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయించిందని, తెలంగాణలో ఎక్కువమంది బీసీలే కనుక ఈ నిర్ణయం తనకు కలిసి వస్తుందని హైకమాండ్ భావిస్తోన్నట్లు కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి.

**బీసీలకే ఎందుకంటే?**

ప్రస్తుతం తెలంగాణలో కులగణన అంశం చర్చలో ఉంది. కులగణన చేసి బీసీల రిజర్వేషన్లను పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే

మిగతా 2లో



# వస్తుందో.. రాదో?

నేడు కవిత బెయిల్‌పై సుప్రీం తుదితీర్పు

ఢిల్లీ చేరిన కేటీఆర్, హరీష్ రావు బృందం

ఆరోగ్యకారణాలతోనైనా బెయిల్ వస్తుందని ఆశ

బెయిల్ వస్తే సంబురాలు.. లేకుంటే నిరసనలు

**హైదరాబాద్:** బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడింట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్ రావు ఢిల్లీ చేరుకున్నారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఈ ఇద్దరు నేతలతో బాటు 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ కీలక నేతలూ హస్తినకు తరలివచ్చారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో

మిగతా 2లో

# మరి వాటి సంగతేంటి?

పాతబస్తీలో హైడ్రా చర్యలేంటి?

నేను వచ్చి చూపిస్తా.. కూల్చేస్తారా?

హైడ్రా చట్టబద్ధతపై క్లారిటీ ఏదీ?

రుణమాఫీ ఫెయిల్..

అందుకే కూల్చివేతలు

అక్బరుద్దీన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం హైడ్రా పేరుతో సామాన్య ప్రజల మీద ప్రతాపం చూపుతోందని, నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పాతబస్తీలోని అక్రమ నిర్మాణాలపైనా చర్యలు తీసుకోవాలని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎంకు ధైర్యముంటే సల్కం చెరువులో ఉన్న ఓవైసీ అక్రమ నిర్మాణాలను కూల్చాలని సవాల్

మిగతా 2లో





# ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి

గతంలో ఇచ్చిన హామీ మేరకు సాగాలి

సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్:** ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను ఉచితంగా అమలు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఉచితమని చెప్పి.. ఇప్పుడు ఫీజులు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. అధికారులకు లక్ష్యాలు విధిస్తూ ప్రజలను వేధిస్తున్నారని విమర్శించారు. ఎల్ఆర్ఎస్ ఉచితంగా అమలయ్యేలా చూసే బాధ్యత భారాస

మిగతా 2లో

# హైదరాబాద్ ఐఐటి విద్యార్థుల ప్రతిభ అద్భుతం

డ్రైవర్‌లెస్ కారును రూపొందించిన విద్యార్థులు

వారు ఎవరికీ తీసిపోరని ప్రశంసించిన మంత్రి శ్రీధర్ బాబు



**సంగారెడ్డి:** హైదరాబాద్ ఐఐటి విద్యార్థుల ప్రతిభ అద్భుతమని ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. వారు ఏదైనా అద్భుతం చేయగల సమర్థులని అన్నారు. ఇతర దేశాల

మిగతా 2లో

# ఎక్కువ మంది సివిల్స్‌కు ఎంపిక కావాలి

ఆత్మస్థయిర్యం నింపడానికే లక్ష రూపాయల సాయం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్:** రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ

మిగతా 2లో

# హైడ్రాకు పెరుగుతున్న మద్దతు

బిఆర్ఎస్ విమర్శలపై మండిపడ్డ కోదండరెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా ఆక్రమణలు కూల్చేయాలన్న నేతలు

కొనసాగుతున్న హైడ్రా దూకుడు

రాయదుర్గంలో ఆక్రమణల కూల్చివేత

హైడ్రా కూల్చివేతలు సమర్థనీయమే

పేదలకు ప్రత్యామ్నాయం చూపాలి

చెరువుల ఆక్రమణలను వదిలేది లేదు

తెలంగాణ వ్యాప్తంగా గుర్తించి చర్యలు

ఆధారాలతో ఎవ్వరైనా ఫిర్యాదు చేయొచ్చు

హైడ్రా చర్యలను సమర్థించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్:** హైడ్రాకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. అటు పొలిటికల్‌గా.. ఇటు సామాన్యుల నుంచి మద్దతు పెద్ద ఎత్తున వస్తోంది. ముఖ్యంగా ఎన్ కన్వెన్షన్ కూల్చివేత హైడ్రాకు కావల్సినంత మద్దతును కూడగట్టింది. అన్ని వర్గాల ప్రజలు దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రాపై సొంత పార్టీలో ఇబ్బందులు వస్తాయని తొలుత సీఎం రేవంత్ రెడ్డి భావించారు. కానీ ఎమ్మెల్యేలంతా రేవంత్ నిర్ణయానికి మద్దతు పలుకుతున్నారు. తెలంగాణ సర్కార్ హైడ్రాను ఏర్పాటు చేసి చెరువులు, కుంటలు, నాలాలు రక్షిస్తోందని కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... దూరదృష్టితో హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు. రాజకీయాలకు అతీతంగా హైడ్రా పనిచేస్తుందని తెలిపారు. ప్రొటెక్షన్ ఆఫ్ లేక్స్ కమిటీ కూడా గతంలో వేసిందే అని చెప్పుకొచ్చారు. రాష్ట్ర విభజన కాకముంటే కాంగ్రెస్ సర్కార్ 2030 వరకు హెచ్ఎమ్‌డీఏ ద్వారా మాస్టర్ ప్లాన్ రూపొందించిందన్నారు. తాగునీటి అవసరాల కోసం కూడా మాస్టర్ ప్లాన్‌లో లేక్స్ ప్రొటెక్షన్ చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. 2014 నుంచి అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అక్రమ నిర్మాణాలకుమద్దతు చేసిందని ఆరోపించారు. హైడ్రా ఏర్పాటు చేసి ప్రజల మన్ననలు పొందుతున్న సీఎం రేవంత్‌పై ఎంఐఎం, బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సామాన్య ప్రజలు పూర్తిగా మద్దతు ఇస్తున్నారన్నారు. ప్రజలు కూడా ర్యాలీ చేస్తున్నారన్నారు. హుస్సేన్ సాగర్ కాపాడుకోవాలని విజయభాస్కర్ రెడ్డి కాలంలో బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు, నెక్లస్ రోడ్ ఏర్పాటైందన్నారు. తొమ్మిదన్నరేళ్ల కాలంలో చెరువులను ఎందుకు కాపాడలేదని హరీష్ రావును

మిగతా 2లో



# ఇది మీ సర్కారు

**హైదరాబాద్:** తెలంగాణలో నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 90 రోజుల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామని సీఎం గుర్తుచేశారు. సోమవారం సాయంత్రం రాజీవ్ గాంధీ అభయహస్త పథకంలో భాగంగా సివిల్స్ ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు రాష్ట్ర సచివాలయంలో అభ్యర్థులకు అభయహస్తం చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం మెయిన్స్ అర్హత సాధించిన 135 మందికి రూ.లక్ష చొప్పున సాయం చేశారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను గాలికొదిలేసిందని, తమ ప్రభుత్వం మాత్రం తొలిరోజు నుంచే వారికి మేలు చేసే దిశగా అడుగులు వేసిందని ముఖ్యమంత్రి వివరించారు.

**రూ.లక్ష సాయం**

ఈ ఏడాది తెలంగాణ నుంచి యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులై.. మెయిన్స్ కోసం సన్నద్ధమవుతున్న 135 మంది అభ్యర్థులకు 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం కింద రూ.1 లక్ష చొప్పున స్వయంగా చెక్కుల రూపంలో ముఖ్యమంత్రి అందించారు. గతంలో ఇచ్చిన ఈ హామీని నేడు నిలుపుకున్నామని, అభ్యర్థులంతా కష్టపడి చదివి రాబోయే మెయిన్స్‌లోనూ ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. మెయిన్స్ క్లియర్ చేసి ఇంటర్వ్యూకి ఎంపికైన వారికి మరో రూ. లక్ష ఆర్థికసాయం ప్రభుత్వం తరపున అందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. అభ్యర్థుల చూపు మీ లక్ష్యం వైపు మాత్రమే ఉండాలని, ప్రతి నిమిషాన్ని వినియోగించుకుని సివిల్స్ పరీక్షలో ఎంపికై, మీ కుటుంబాల ప్రతిష్టతో బాటు రాష్ట్ర ప్రతిష్టనూ పెంచాలని పిలుపునిచ్చారు. ఇకపై తెలంగాణ నుంచి ఏటా అత్యధికంగా సివిల్ సర్వెంట్లు రావాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ పథకానికి నిధులు సమకూర్చిన సింగరేణి కాలరీస్‌కు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

**100 స్పోర్ట్స్ స్కూల్స్**

వచ్చే ఏడాది ఫ్యూచర్ సిటీలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు అత్యధికంగా పతకాలు వచ్చేలా కార్యాచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో 25 నుంచి 30 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఒక్కో స్కూల్‌కు రూ.100 నుంచి రూ.150 కోట్లు ఖర్చు చేస్తామని అన్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆటల్లో రాణిస్తున్న వారికి ఈ స్కూళ్లలో అడ్మిషన్లు ఇవ్వటమే గాక అంతర్జాతీయ స్థాయి కోచ్‌ల చేత శిక్షణను ఇప్పిస్తామన్నారు. సౌత్ కొరియాలోని స్పోర్ట్స్ వర్సిటీతో ఈ దిశగా చర్చలు జరిపామని తెలిపారు. ఈ స్కూళ్లలో అడ్మిషన్ పొందిన వారికి ఉచితంగా శిక్షణ లభిస్తుందని తెలిపారు.

**ఏటా 2 వేల మందికి శిక్షణ**

ఉన్నత విద్యను అభ్యసించిన యువతకు ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు లేకపోవడంతోనే నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే.. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఏటా 20 వేల మందికి శిక్షణ ఇస్తామని, శిక్షణ పూర్తికాగానే వారికి వెంటనే ఉపాధి లభించేలా ఆయా సంస్థలతో మాట్లాడుతున్నామని వెల్లడించారు. తెలంగాణ వచ్చిన నాటి నుంచి రాష్ట్రాన్ని ఏలిన వాళ్లు తమ పదవుల కోసమే పాటు పడటంతో ప్రజలు ఈరోజు వారిని రాజకీయ నిరుద్యోగులుగా మార్చేశారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అనుక్షణం తెలంగాణ సమాజం మేలు కోసం కష్టపడి చేస్తోందని తెలిపారు.

**వాళ్ల ఉచ్చులో పడొద్దు..**

గత పదేళ్ల కాలంలో ఉద్యోగ నోటిఫికేషన్లు, పరీక్షల కోసం పదేళ్లు నిరుద్యోగులు దీక్షలు, ధర్నాలు చేశారని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియామకాలు చేపడుతుంటే.. పరీక్షలు వాయిదాలు వేయాలని కొందరు రాజకీయ నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారని అన్నారు. నిరుద్యోగులుగా మారిన కొందరు నేతలు నిరుద్యోగులను రెచ్చగొట్టే పనిలో ఉన్నారని, వారి ఉచ్చులో పడొద్దని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను, పాలనను యువత, విద్యార్థులు తమకోణంలో ఆలోచించి ఒక అభిప్రాయానికి రావాలని సీఎం కోరారు. గత ప్రభుత్వం వర్సిటీలను నిర్వీర్యం చేసింది. 10, 15 రోజుల్లో అన్ని వర్సిటీలకు నూతన వైస్ ఛాన్సలర్లను నియమిస్తామని, వర్సిటీల్లోని అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు.

**35 వేల పోస్టుల భర్తీ**

రాబోయే రోజుల్లో మరో 35 వేల ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నట్లు సీఎం తెలిపారు. ఇప్పటికే జాబ్ కేలండర్ విడుదల చేశామని, దశల వారీగా ఉద్యోగాల భర్తీ జరుగుతోందన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక.. యూపీఎస్సీతో సంప్రదించి పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చే విషయంలో తమ ప్రభుత్వం వెనకంజ వేయబోదని తెలిపారు.

**ఇదీ తేడా**

గతంలో ఎవరూ చేయని రీతిలో అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ నాయకత్వంలోని ప్రభుత్వం పనిచేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఒక సరికొత్త ప్రయోగమని, తొలి ఏడాదిలోనే వీటికోసం రూ. 5 వేల కోట్లతో నిధులు ఖర్చుపెట్టబోతున్నామన్నారు. గతంలో ప్రభుత్వాలు రెసిడెన్షియల్ స్కూల్స్, మౌలిక సదుపాయాల కోసం ఏటా రూ.3 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టేదని, కానీ ఈ ఏడాది తమ ప్రభుత్వం దానిని రూ. 5 వేల కోట్లకు పెంచిందన్నారు. అంగన్వాడి దగ్గర నుంచి యూనివర్సిటీ వరకు ప్రతి విద్యాసంస్థ ప్రమాణాలను మెరుగుపరచేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికలు చేసిందని తెలిపారు.

# నెక్ట్స్ పీసీసీ చీఫ్ ఆయనే..

మొదటి పేజీ తరువాయి

డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. అయితే.. కులగణన చేపడితే ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో అక్టోబర్‌లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే వాదనా ఉంది. ఒకవేళ.. కులగణన నిర్వహించకుండా ఎన్నికలకు వెళ్తే బీసీలు అసంతృప్తికి గురవుతారనే కారణంతోనే ఈసారి పీసీసీ వారికి ఇచ్చేందుకు రెడీ అవుతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. బీసీలకు పీసీసీ చీఫ్ పదవి ఇవ్వడం ద్వారా వెనుకబడిన వర్గాలపై కాంగ్రెస్ పార్టీ నిబద్ధతను ప్రకటించినట్లవుతుందని పార్టీ పెద్దలు భావిస్తున్నారు.

**అదే ఫార్ములా..**

గతంలో ఉమ్మడి ఏపీలో విజయవంతమైన రెడ్డి, బీసీ కాంబినేషన్‌ను మరోసారి రిపీట్ చేయటమే మంచిదని అధిష్ఠానం భావిస్తోంది. 2004లో ముఖ్యమంత్రి పదవి వైఎస్ఆర్‌కు దక్కగా, పీసీసీ పదవి డీ శ్రీనివాస్‌కు ఇచ్చారు. ఇప్పుడూ అదే తరహాలో సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నందున పీసీసీ బీసీలకు ఇవ్వటం సముచితంగా ఉంటుందని నిర్ణయించినట్లు తెలుస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రచార కమిటీ సభ్యుడు మధుయాష్కీగౌడ్, ప్రస్తుత కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎస్టీ సామాజిక వర్గం నుంచి ఎంపీ బలరాం నాయక్ వంటి పేర్లు పరిశీలనకు వచ్చాయని, కాగా, బీసీ సామాజిక వర్గం నుంచి రెండు, మూడు పేర్లు వినిపించినా విద్యార్థి నాయకుడిగా ఎన్ఎస్‌యూఐలో కీలకంగా పనిచేసి, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో సీనియర్‌గా ఉన్న మహేష్ కుమార్ గౌడ్‌ను అదృష్టం వరించినట్లు తెలుస్తోంది. కాగా, నేడో రేపో అధిష్టాన వర్గం అధికారికంగా పేరును ప్రకటించే అవకాశం ఉంది.



# హైడ్రాకు పెరుగుతున్న మద్దతు

మొదటి పేజీ తరువాయి

కోదండరెడ్డి ప్రశ్నించారు. కేవలం ప్రభుత్వంపై విమర్శలు చేయడమే బిఆర్ఎస్ లక్ష్యంగా ఉందన్నారు. ప్రకృతిని కాపాడడానికి చెరువులు కాపాడాలన్నారు. హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల కోసం కృష్ణ, గోదావరి నీటిని తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ సర్కారే రానున్న 30 ఏళ్ల వరకు తాగునీటి కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించారని తెలిపారు. ధర్మం కోసం భగవత్ గీతను కూడా స్ఫూర్తిగా తీసుకున్నా అని సీఎం రేవంత్ నిన్న చెప్పారన్నారు. హెచ్‌ఎండీలో అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని కోదండరెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఇకపోతే హైడ్రా లాంటి వ్యవస్థను రాష్ట్రమంతటా విస్తారించాలని రేవంత్‌కి ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేస్తున్నారు. హైడ్రాపై అభినందనలు తెలుపుతూ రేవంత్‌కి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్‌లు లేఖ రాశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో హైడ్రా తరహా వ్యవస్థ కోసం సీఎం రేవంత్‌కి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లేఖ రాశారు. వేములవాడ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు ఎఫ్‌టీఎల్ పరిధిలో గెస్ట్ హౌజ్ కట్టాడని ఆది శ్రీనివాస్ లేఖలో పేర్కొన్నారు. హైడ్రాను తమ నియోజకవర్గంలో కూడా విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రిక్వెస్ట్ చేశారు. నకిరేకల్ నియోజకవర్గంలో కూడా ఆక్రమణకు గురైన భూములను కాపాడాలని వేముల వీరేశం లేఖ రాశారు. ఆలేరు నియోజకవర్గంలో ఆక్రమణకు గురైన భూములు, అక్రమ కట్టడాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సీఎంకి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య లేఖ రాశారు. తమ నియోజకవర్గంలో హైడ్రా లాంటి వ్యవస్థను తీసుకు రావాలని మానుకొండూర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే కాలే యాదయ్య, తదితరులు రేవంత్‌కి లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జ్ఞాన సుందర్ గాంధీ భవన్‌లో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి హైట్ కొలవగలరేమో కానీ ఆయన ఆత్మవిశ్వాసాన్ని కొలవలేరని కొనియాడారు. పేదవాడిని కొట్టడం తప్ప, పెద్ద వాళ్ళకి వ్యతిరేకంగా ఏ ప్రభుత్వం పోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎవరికీ భయపడకుండా ముందుకి పోతోందన్నారు. హైడ్రాకి ప్రజల మద్దతు ఉందన్నారు. తెలంగాణ అంతటా హైడ్రా లాంటి వ్యవస్థను విస్తరించాలని కోరారు. రేవంత్ ఆలోచనకి ప్రతిపక్షాల మైండ్ బ్లాంక్ అవుతోందన్నారు. గత ప్రభుత్వంలో అధికారులు బీఆర్ఎస్ నాయకులు చెప్పినట్టు విన్నారని.. అందుకే ఫేక్ పట్టాలు పొందగలిగారని జ్ఞాన సుందర్ పేర్కొన్నారు. అయితే నగరంలో హైడ్రా మాత్రం నాన్ స్టాప్‌గా కూల్చివేతలు నిర్వహిస్తోంది. శేర్లింగంపల్లి మండలం రాయదుర్గంలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. రాయదుర్గం సర్వేనెంబర్ 72లో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. భారీగా పోలీసుల మోహరించారు. కూల్చివేతలను స్థానికులు అడ్డుకుంటున్నారు.

**కొనసాగుతున్న హైడ్రా దూకుడు**

నగరంలో హైడ్రా కూల్చివేతలు ఆక్రమణదారుల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. వరసగా కూల్చివేతలు చేస్తూ అక్రమార్కుల గుండెల్లో హైడ్రా నిద్రపోతోంది. పేద, ధనిక, సినిమా స్టార్లు, రాజకీయ నేతలు ఇలా ఎవరినీ వదిలిపెట్టకుండా కబ్జాలకు అడ్డుకట్ట వేస్తోంది. ప్రభుత్వ స్థలాన్ని అంగులం ఆక్రమించిన తీవ్రంగా స్పందిస్తోంది. తాజాగా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. రాయదుర్గం సర్వే నంబర్ 3, 4, 5, 72లోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా కట్టిన భవనాలను కూల్చివేస్తున్నారు. అయితే తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చర్యలు చేపట్టారంటూ జీహెచ్ఎస్సీ టౌన్ ప్లానింగ్ అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. తమ ఇళ్లను కూల్చవద్దంటూ ఆందోళనకు దిగారు. అధికారులతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అధికారుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసులు భారీగా చేరుకున్నారు. పోలీసుల ఆధ్వర్యంలో కూల్చివేతల పర్వం సాగుతోంది. తెలంగాణ ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా వ్యవస్థను తీసుకువచ్చారు. ప్రభుత్వ ఆస్తుల సంరక్షణెళి లక్ష్యంగా ఆ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నగరంలో జనాభా పెరిగిపోతుండడంతో ఇష్టాను సారంగా చెరువులు, ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. సరైన పర్యవేక్షణ వ్యవస్థ లేకపోవడంతో ఇన్నాళ్లూ ఆక్రమణదారులు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా సాగింది. హైడ్రా రావడంతో నగర పరిధిలో చర్యలు చేపడుతోంది. ఇటీవల సినీనటుడు నాగార్జునకు చెందిన మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌ను అధికారులు కూల్చివేశారు. కూల్చివేతలను అడ్డుకునేందుకు ఆయన హైకోర్టును సైతం ఆశ్రయించారు. అయితే ఈ లోపే అధికారులు దాన్ని నేలమట్టం చేశారు. మరోవైపు బీఆర్ఎస్ నేత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్శిటీపై కూడా ఆరోపణలు వచ్చాయి.

అక్రమంగా భూములు కబ్జా చేసి నిర్మాణాలు చేశారంటూ ఆయనపై ఇప్పటికే పలు కేసులు నమోదు అయ్యాయి. మరోవైపు అధికార పార్టీ నేతలను సైతం హైడ్రా వదిలిపెట్టడం లేదు. ఇలా చిన్నా, పెద్ద తేడా లేకుండా హైడ్రా ఆక్రమణదారుల బెండు తీస్తోంది. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రాను స్వాగతిస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో నారాయణ మాట్లాడారు. హైదరాబాద్‌లో చెరువులు, నాలాలు కబ్జా చేయడం వల్ల వర్షపు నీరు ఎటు వెళ్లాలో అర్థం కావడం లేదు. అందుకే అరగంటపాటు వర్షం కురిస్తే నగరం ముంపునకు గురయ్యే పరిస్థితి వస్తోంది. హైడ్రా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చుతున్నారు. వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పులిమీద స్వారీ చేస్తున్నారు. ఆయన పులి మీద నుంచి దిగొద్దు.. దిగితే మింగేసే ప్రమాదం ఉంది. చెరువుల్లో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవ చేస్తున్నాయి. ప్రభుత్వ భూములను కార్పొరేట్ శక్తులు కబ్జా చేసి కార్యాలయాలు నడుపుతున్నాయి. ఈ అంశంపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నారాయణ డిమాండ్ చేశారు. భాజపాయేతర రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందనినారాయణ అన్నారు. దేశంలో ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బ తీస్తున్నారని విమర్శించారు. అదానీకి సెబి దాసోహమైందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై జేపీసీ వేయాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌పరిధిలో హైడ్రా చేపట్టిన అక్రమ కట్టడాల కూల్చివేతల పై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా.. ముందు రాజధాని నగరంలో, తరువాత అన్ని జిల్లాల్లో చెరువులు ఆక్రమణకు గురయ్యాయో వివరాలు సేకరించి వాటిని పునరుద్ధరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. భౌగోళిక పరిస్థితుల్లో వాతావరణ కాలుష్యం నుండి వాతావరణాన్ని పరిరక్షించుకోవడానికి, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి గతంలో ఉన్న చెరువులకు ప్రభుత్వ లెక్కలకు రికార్డులకు అనుగుణంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు.

## మొదటి పేజీ తరువాయి

### వస్తుందో.. రాదో?

కేటీఆర్ సోదరి, ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై నేడు సుప్రీంకోర్టు తుది తీర్పును వెలువరించనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నేతల్లో టెన్షన్ నెలకొంది.

**బెయిల్ వస్తుందా?**

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఈ ఏడాది మార్చి 15 నుంచి కవిత జైలు శిక్షను అనుభవిస్తున్నారు. అయితే, ఈ కేసులో సహ నిందితులుగా ఉన్న కేజ్రీవాల్, మనీశ్ సిసోడియాలకు ఇప్పటికే న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. సీబీఐ, ఈడీ కూడా.. బెయిల్ విషయంలో పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం లేదని భావిస్తున్నారు. ఇప్పటికే సుదీర్ఘ కాలంగా కవిత జైల్లోనే ఉండటం, సీబీఐ చార్జిషీట్లపై దర్యాప్తు పూర్తి కావటంతో ఈసారి ఈడీ, సీబీఐ కవిత బెయిల్‌కు అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశాలు తక్కువని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. పైగా, కవిత ఆరోగ్యం కూడా బాగోలేకపోవడంతో ఈసారి సుప్రీంకోర్టులో తప్పకుండా బెయిల్ వస్తుందని గులాబీ నేతలు భావిస్తున్నారు. కవిత తరఫున ప్రముఖ లాయర్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తున్నారు.

**అనారోగ్య కారణాలతో..**

అనారోగ్య నేపథ్యంలోనైనా కవితకు ఈసారి బెయిల్ వస్తుందని కేటీఆర్ అండ్ కో భావిస్తున్నారు. మార్చి 15 నుంచి జైలులో ఉన్న కవిత జూలై 16న తొలిసారి అస్వస్థతకు లోనవగా, ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రెండు రోజుల తర్వాత 18న ఆమెను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరచగా, తనకు ఎదురవుతున్న అనారోగ్య సమస్యలను జడ్జి కావేరి బవేజా దృష్టికి కవిత తీసుకెళ్లారు. కవిత విజ్ఞప్తి మేరకు ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలకు అనుమతి ఇచ్చారు. అప్పటి నుంచి ఆమె ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగుపడలేదు. జైలు వైద్యులే ఆమెకు వైద్యం అందిస్తున్నారు. మళ్లీ ఆగస్టు 22న మరోసారి అనారోగ్యానికి గురికాగా, ఢిల్లీ ఎయిమ్స్‌కు కవితను తరలించి, భర్త అనిల్ సమక్షంలో వైద్య పరీక్షలు చేశారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో తిరిగి జైలుకు తరలించారు. ఆమె సుమారు ఐదున్నర నెలల నుంచి జైలులోనే ఉన్నారు. జైలుకు వెళ్లిన తర్వాత ఆమె సుమారు 11 కేజీల బరువు తగ్గారు.

### మరి వాటి సంగతేంటి?

విసిరారు. కూల్చివేతలకే హైడ్రా పరిమితమైతే ప్రయోజనం ఉండదని, ఆక్రమిత భూములను ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

**డీజిల్ లేక ఆగిపోయారా?**

హైదరాబాద్ పాతబస్తీలో గత రెండు దశాబ్దాలుగా చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని ఏలేటి ఆరోపించారు. బుల్డోజర్లు పాతబస్తీకి వెళ్లడానికి పెట్రోల్, డీజిల్ ఉందో లేదో చెప్పాలని ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పాతబస్తీలో మొత్తం ఎన్ని చెరువులున్నాయి? ఎన్ని ఎకరాల భూమి కబ్జాకు గురైందో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. అక్కడ అన్యాక్రాంతమైన భూములు ఎవరి పేరుమీద ఉన్నాయో గుర్తించి, అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని, ఆ భూముల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, ఫెన్సింగ్ వేయాలని కోరారు.

### ఎల్‌ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి

తీసుకుంటుందన్నారు. ఎన్నికలకు ముందు అన్ని ఫ్రీ అన్నారు.. ఇప్పుడేమో ప్రతిదానికి ఫీజులు వసూలు చేస్తున్నారంటూ హరీశ్‌రావు మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఎల్ఆర్ఎస్(భూముల క్రమబద్ధీకరణ) పథకాన్ని పూర్తి ఉచితంగా అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. ఒకవైపు రుణమాఫీ కాక, రైతు బంధు రాక రైతన్నలు ఆవేదన చెందుతుంటే, మరోవైపు విషజ్వరాలతో సామాన్య ప్రజలు ఆసుపత్రుల పాలై, ఖర్చులు భరించలేక అల్లాడుతున్నారు. ఇలాంటి ప్రధానమైన సమస్యలను పరిష్కరించి ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన మీ ప్రభుత్వం, ఎల్ఆర్ఎస్ ఫీజులు వసూలు చేయాలని కలెక్టర్ స్థాయి నుంచి పంచాయతీ సెక్రెటరీ వరకు ఉన్న యంత్రాంగం మీద తీవ్ర ఒత్తిడి చేస్తున్నది. పంచాయతీ సెక్రెటరీలు, బిల్ కలెక్టర్లు రోజుకు మూడు నాలుగు సార్లు ఫోన్లు చేస్తూ ప్రజలను వేధిస్తున్నారు. ఫీజులు చెల్లించకుంటే లేఅవుట్లు రద్దు చేస్తామంటూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నారు.

### హైదరాబాద్ ఐఐటి విద్యార్థుల ప్రతిభ అద్భుతం

పరిశోధనలకు వారేమీ తీసి పోరని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతుంది. డ్రైవర్ లెస్ కార్లు అగ్రరాజ్యం అమెరికాలో ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. మిగతా దేశాల్లో క్రమంగా అందుబాటులోకి రానున్నాయి. కంది ఐఐటీ క్యాంపస్‌లో విద్యార్థులు డ్రైవర్ లెస్ కారును రూపొందించారు. ఆ కారులో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రయాణించారు. కారులో ప్రయాణం మధురానుభూతి కలిగించిందని వివరించారు. 'ఐఐటీ విద్యార్థులు రూపొందించిన డ్రైవర్ లెస్ కారు అద్భుతంగా ఉంది. సిలికాన్ వ్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి, నేను డ్రైవర్ లెస్ వెహికిల్‌లో ప్రయాణించాం. ఆ ప్రయాణం కంటే ఈ రోజు చేసిన జర్నీ అద్భుతమైన అనుభూతి కలిగించింది. తెలంగాణ రాష్ట్రంలో ఐఐటీ హైదరాబాద్ రూపొందించిన ఈ టెక్నాలజీ దేశానికి గర్వకారణంగా నిలుస్తోంది. ప్రయోగ దశలో ఉన్న టెక్నాలజీ త్వరలో ఆచరణలోకి రావాలని కోరుకుంటున్నా. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సేవలను అన్ని రంగాల్లో రావాలని అభిలషిస్తున్నా అని' మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. అమెరికాలో ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు పర్యటించారు. రాష్ట్రంలో పెట్టుబడులు తీసుకొచ్చేందుకు పర్యటన సాగింది. సిలికాన్ వ్యాలీలో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్ బాబు డ్రైవర్ లెస్ కారులో జర్నీ చేశారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొట్టాయి. ఆ తర్వాత ఈ రోజు కంది వర్సిటీలో డ్రైవర్ లెస్ కారులో మంత్రి శ్రీధర్ బాబు ప్రయాణించారు.

### ఎక్కువ మంది సివిల్స్‌కు ఎంపిక కావాలి

సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మన రాష్ట్రం నుండి పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుండి ఎక్కువ మంది ఎంపిక అవ్వాలన్నారు. వాళ్లకు ఆర్థిక ఇబ్బంది నీ కొంతైనా తగ్గించాలని లక్ష రూపాయలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని, లక్ష పెద్ద నగదు కాకపోయినా.. కొంతైనా ఉపశమనం కలగాలని మా ప్రయత్నమని భట్టి విక్రమార్క అన్నారు.

తొలిపొద్దు DIGITAL PAPER
హైదరాబాద్ |మంగళవారం 27 | ఆగష్టు 2024
Gmail tolipoddudigitalnews@gmail.com



# శ్రీశైలం దేవస్థానంలో కృష్ణాష్టమి

## ఘనంగా గోపూజ నిర్వహణ

**శ్రీశైలం:** కృష్ణాష్టమి సందర్భంగా శ్రీశైలం దేవస్థానంలో ఉదయం గోవుపూజ ఘనంగా నిర్వహించారు. క్షేత్రంలో నిత్యం ప్రాతఃకాలంలో నిత్యసేవగా గోపూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుండగా జన్మాష్టమి సందర్భంగా నిత్యసేవతో పాటు విశేషం జరిపించారు. మొదట ఆలయప్రాంగణంలో ఉన్న గోకులంలో ఆవుదూడలకు పూజాధికాలు నిర్వహించారు. అంతకు ముందు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు, వేదపండితులు పూజా సంకల్పం పఠించారు. ఆ తర్వాత కార్యక్రమంగా నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూ జరిపించారు. శ్రీసూక్తంతోనూ, గో అష్టోత్తరమంత్రంతోనూ గోవులకు షోడశ ఉపచారాలతో పూజాధికాలు జరిపించారు. చివరగా గోవులకు నివేదన, నీరాజన



మంత్రపుష్పాలు సమర్పించారు. దేవస్థాన గో సంరక్షణశాలలో కూడా శ్రీకృష్ణుడి, గోవులకు పూజలు చేశారు.వేద సంస్కృతిలో గోవుకు ఎంతో విశేషస్థానం ఉందని.. వేదాలు, ఉపనిషత్తులు, శాస్త్రాలు, పురాణాలు అన్నీ గోపూజ ఫలితాన్ని విశేషంగా పేర్కొంటున్నాయని ఆలయ పండితులు తెలిపారు. గోవు సకల దేవతలకు ఆవాస స్థానమని.. దాన్ని పూజించడం ద్వారా దేవతలందరినీ పూజించిన ఫలితం లభిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయని చెప్పారు. జగన్మాత లలితాపరమేశ్వరి గోవురూపంలో భూమిపై సంచరిస్తుందని చెప్పబడిందన్నారు. తాను చేసిన ప్రతిపనిలో వైశిష్ట్యాన్ని బోధించిన శ్రీకృష్ణపరమాత్ముడు ఆవుల మంద అధికంగా ఉన్న కారణంగా గోకులంగా పేరొందిన రేపల్లెలో పెరిగి గోవులను కాసి, గోపాలునిగా పేరుగాంచి.. గోవు అనంత మహిమను లోకానికి తెలియజేశాడని.. ఈ కారణంగానే గోకులాష్టమి రోజున గోవును పూజించడం సంప్రదాయంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఈవో డీ పెద్దిరాజు, ఏఈవో ఐఎన్‌వీ మోహన్, పర్యవేక్షకురాలు స్వర్ణలత, అర్చకులు పాల్గొన్నారు.

---

## రావి చెట్టు హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో అన్నదానం

**తొలి పొద్దు, సిద్దిపేట :**సిద్దిపేట శ్రీ రావి చెట్టు హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోగుల బంధువులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు మాట్లాడుతూ... రావి చెట్టు హనుమాన్ భక్త బృందం సభ్యులు సేవా కార్యక్రమాలలో సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వడ్లకొండ సాయికుమార్, బర్ల మల్లికార్జున్,రావి చెట్టు హనుమాన్ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

## కొండపోచమ్మ చెరువు శిఖంలో అక్రమ నిర్మాణాలను తొలగించాలి

### సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్

**తొలిపొద్దు, సిద్దిపేట / చేర్యాల :** నాగపురి గ్రామ రెవెన్యూ శివారు కొండ (నల్ల) పోచమ్మ చెరువు శిఖంలో నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...నాగపురి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 831లో కొండపోచమ్మ చెరువు 22.02 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నది. ఈ చెరువుకు వందలాది ఎకరాల ఆయకట్టు ఉన్నది. కొండపోచమ్మ చెరువు శిఖంలో కొందరు అక్రమార్కులు ఖబ్జా చేసి నిర్మాణాలు చేశారని ఆరోపించారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు గ్రామస్థులు పలుమార్లు పిర్యాదు చేసినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదన్నారు. చెరువు శిఖం ఖబ్జా విషయం పై రెవెన్యూ, ఐబీ అధికారులకు ఎన్నో సార్లు పిర్యాదు చేసిన అధికారులకు కనీసం చీమ కుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. చెరువు రక్షణ కోసం వెళ్ళిన గ్రామస్తులపై ఖబ్జా దారులు అనేక కేసులు పెట్టారని, హైడ్రా తరహాలో చెరువు శిఖంలో అక్రమ నిర్మాణాలను తొలగించి చెరువు శిఖం భూమిని కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

---

## టీడీఆర్ బాండ్ల అక్రమాలపై విచారణ

టీడీఆర్ బాండ్ల అక్రమాలపై విచారణకు కమిటీ వేశామని, సెప్టెంబర్ చివరి నాటికి టీడీఆర్ బాండ్ల అక్రమాలు తేలుస్తామని ఏపీ మంత్రి నారాయణ తెలిపారు. తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీడీఆర్ బాండ్లలో రూ.వేల కోట్లు పక్కదారి పట్టాయన్నారు. కమిటీ నివేదిక వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. వైకాపా పాలనలో అవినీతిని కొత్తపుంతలు తొక్కించారు. నగరపాలక సంస్థల్లో ఉద్యోగులను నియమించి వ్యక్తిగత అవసరాలకు వినియోగించారు. మున్సిపల్ శాఖలోని సమస్యలను 6 నెలల్లో పరిష్కరిస్తాంఅని నారాయణ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగు పడాలంటే పరిశ్రమలు రావాలని మంత్రి నారాయణ అన్నారు. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు.

---

# నేడు ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ పై విచారణ

### ఢిల్లీ వెళ్లిన 20 మంది ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు

### అభిమానులు, నేతల్లో ఉత్కంఠ

**(తొలిపొద్దు, పొలిటికల్ కరెస్పాండెంట్ ):** బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్ పై మంగళవారం సుప్రీం కోర్టు లో విచారణ జరుగనున్నది. ఢిల్లీ మద్యం కేసులో లో అరెస్టుఅయిన కవిత ప్రస్తుతం తీహార్ జైల్లో ఉంటున్నసంగతి తెలిసిందే. ఆమె ఇటీవల జైల్లో రెండు సార్లు తీవ్ర అస్వస్థతకు



గురికాగా, ఢిల్లీ ఎయిమ్స్ కు తరలించి చికిత్స అందించారు. అనంతరం తిరిగి జైలుకు తరలించారు. ఈడి అరెస్ట్ తర్వాత ఎమ్మెల్సీ కవిత మార్చి 15 నుంచి తీహార్ జైల్లో ఉంటున్నారు. తనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు జూలై 1న తీర్పు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ ఆమె ఈ నెల 8న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాగా కవిత తరఫున ప్రముఖ న్యాయవాది ముకుల్ రోహద్గి వాదనలు వినిపించనున్నారు. అయితే ఈసారి కవితకు బెయిల్ తప్పకుండా వస్తుందనే నమ్మకంతో బీఆర్ఎస్ నాయకత్వం ఉండగా, అభిమానులు, కార్యకర్తల్లో మాత్రం ఉత్కంఠం కొనసాగుతోంది.

---

# తెలంగాణ సాంస్కృతిక సారథి. జిల్లా నూతన అధ్యక్షులు కళాంజలి రాజేష్





**తొలి పొద్దు సిద్ధిపేట ప్రతినిధి:** సిద్ధిపేట జిల్లా కేంద్రం ప్రెస్ క్లబ్ లో సిద్ధిపేట జిల్లా తెలంగాణ సంస్కృతిక సారథి జిల్లా సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో జిల్లా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి.తెలంగాణ సాంస్కృతిక సారథి. సిద్దిపేట జిల్లా కమిటీ అధ్యక్షులుగా కళాంజలి (విడిశెట్టి) రాజేష్ ప్రధాన కార్యదర్శిగా పిల్లుట్ల శ్యాంసుందర్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మొగిలిపాక స్నేహ,కొమ్ము రవీందర్,కోశాధికారిగా వెంకటాపురం రవి, కొమ్ము రవీందర్, సహాయ కార్యదర్శులుగా శంకర్ బాబు , మంజుల, ముక్కపల్లి భార్గవి, ప్రచార కార్యదర్శిగా వివి కన్న , గౌరవ అధ్యక్షులుగా మయూరి భాస్కర్, పిల్లుట్ల ప్రకాష్ లు గౌరవ సలహాదారులు గా పుల్లూరు యాదగిరి, ఎనగందుల భాస్కర్, మోతె బాబులు, కార్యవర్గ సభ్యులుగా ముదిగొండ నర్సింలు, సౌమ్య , హరి ప్రసాద్, ఎల్లగారి శేఖర్ , మను, సనువాల కనకయ్య , తండా బిక్షపతి, శైలజ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడపగడపల తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు ప్రణాళికబద్ధంగా నూతన ఆలోచనలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ ముందుకు వెళ్లే దిశగా ఈ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు

---

## ఏనుగుల దాడిలో వృద్ధుడి మృతి

**కొమరాడ:** మన్యం జిల్లా కొమరాడ మండలం వన్నాం గ్రామంలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. ఓ వృద్ధుడిపై దాడి చేసి ప్రాణాలు తీశాయి. స్థానిక వాగులో స్నానం చేసిన శివుడినాయుడు (62) తిరిగి ఇంటికి వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

---

# కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం

## పాలీగ్రాఫ్ పరీక్షలో భిన్న కథనాలు

### నిందితుడు సంజయ్‌రాయ్ వెల్లడించినట్లు కథనాలు

**కోల్‌కతా:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనలో ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్‌కి ఇటీవల పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించారు. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా ప్రస్తుతం అతడు కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ జైల్లో ఉండగా అక్కడే ఈ లై డిటెక్టర్ పరీక్ష చేపట్టారు. ఇందులో నిందితుడు ఏం చెప్పారన్న వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. అయితే, పాలీగ్రాఫ్ పరీక్షలో నిందితుడు అసత్యం, పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. తాను వెళ్లేసరికే వైద్యురాలు చనిపోయిందని అతడు చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు



ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ఆగస్టు 9న ఈ దారుణం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఆ మరుసటి రోజే సివిక్ వాలంటీర్ అయిన సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ కోర్టు ఆదేశాలతో నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్ష సమయంలో సంజయ్ అనాలోచితంగా, ఆత్రుతగా ఉన్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. అధికారులు అడిగిన ప్రశ్నలకు అవాస్తవాలు, సరిపోలని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. దర్యాప్తు బృందం ఆధారాలు చూపించి నప్పుడు.. ఆ సమయంలో తాను అక్కడ లేనని నిందితుడు చెప్పాడట. అంతేగాక, తాను సెమినార్ హాల్‌కు వెళ్లేసరికి వైద్యురాలు అప్పటికే చనిపోయి ఉందని, భయంతో తాను అక్కడి నుంచి పారిపోయానని సంజయ్ చెప్పినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. మరోవైపు, నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించే సమయంలో అతడి తరఫు డిఫెన్స్ లాయర్ లేకపోవడం చర్చనీయాంశమైంది. దీనిపై న్యాయవాది స్పందిస్తూ.. పరీక్ష ఎక్కడ నిర్వహిస్తామన్నది అధికారులు తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని, ఇది మానవహక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని ఆరోపించారు. కాగా.. వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడింది తానేనంటూ అంతకు ముందు కోల్‌కతా పోలీసుల ఎదుట నిందితుడు నేరం అంగీకరించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే.

---



## మంద కృష్ణ కు మతిభ్రమించింది

### ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మద్దెల నర్సింలు

**తొలిపొద్దు, సిద్దిపేట ప్రతినిధి :** మాల మేధావులందరూ మనువాదులే అని మందకృష్ణ వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ మద్దెల నర్సింలు అన్నారు. సోమవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మాట్లాడారు. దళిత ఐక్య ఉద్యమాలకు మాలలు అందరూ ఏకమై పోరాటం చేస్తుంటే తట్టుకోలేక మందకృష్ణ మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. రిజర్వేషన్ల కోసం మాల మాదిగలు కలిసి కొట్లాడితేనే రిజర్వేషన్లు ఇప్పటికీ కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధంగా వర్గీకరణ శాస్త్రీయంగా కాకుండా అశాస్త్రీయంగా జరిగింది కనుక రాజ్యాంగబద్ధంగానే పోరాటాల ద్వారా అడ్డుకుంటామన్నారు. కారంచేడు, చుండూరు సంఘటనలలో మాదిగలకు అన్యాయం జరిగితే వారి తరఫున మాల సామాజిక వర్గానికి చెందిన బొజ్జ తారకం. కత్తి పద్మారావు లాంటివారు పోరాడి ఎస్సీ ఎస్టీ చట్టం బలోపేతం చేయడంతో పాటు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మతతత్వ పార్టీ అయిన బిజెపికి మద్దతు పలికే మందకృష్ణ అసలైన మనువాది అని అన్నారు. రిజర్వేషన్ల విషయంలో మీరు పోరాటం అయినా చేసుకోండి కానీ మాలల ఆత్మగౌరవాన్ని తగ్గించే విధంగా మాట్లాడితే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. నాటి చరిత్ర పొడుగునా నేటి వరకు నిస్వార్థ ఉద్యమాలకు ఊపిరే మాలలే. దళిత ఉద్యమం పేరుతో మాల మహానాడు స్థాపించిన పివి రావు ఆయన ఆస్తులు ఎంత ! మందకృష్ణ మాదిగ ఆస్తులు ఎంత! హక్కుల కోసం మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ ఆ హక్కులు మాట్లాడే హక్కును ఇచ్చినటువంటి అంబేద్కర్ను మరిచిపోతున్నావంటే ఇంతకంటే దుర్మార్గం లేదు. మాల మాదిగల మధ్య ద్వేషాలు సృష్టించి నీ అబ్బం గడుపుకుంటున్న నీకు త్వరలోనే నీ సామాజిక వర్గ అంబేద్కర్ యు లే నీకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు ర్యాకం శ్రీరాములు, ఎలుక దేవయ్య, వెన్న రాజు, కొదాది శ్రీనివాస్, గుడిమల్ల సత్తయ్య, అల్లిబిల్లి నర్సింగ్ రావు, బుట్టి సత్యనారయణ. గ్యాదరి మల్లేశం. పాల శంకర్. జంజరపు ఎల్లేష్ దారస్వామి పత్తి రాజేందర్ యాస శ్రీనివాస్ బందెల హరీష్ సుకోజి సతీష్ రాజు సంభ మాదా తరుణ్ కుమార్. యాదగిరి , సంబా యాదగిరి. మాదాసు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

---

## నేడు యాదాద్రికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**హైదరాబాద్:** తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ నెల 27వ తేదీన యాదాద్రి పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామికి గవర్నర్ ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో యాదాద్రిలో మంగళవారం బ్రేక్ దర్శన వేళల్లో మార్పులు చేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. భక్తుల బ్రేక్ దర్శన సమయం ఉదయం 10 గంటల నుంచి ఉదయం 10.30 గంటలకు మార్చినట్లు పేర్కొన్నారు. అంతరాలయ దర్శన సమయం ఉదయం 9.30 నుంచి ఉదయం 10 గంటలకు మార్చినట్లు తెలిపారు. యాదాద్రి పుణ్యక్షేత్రంలో ప్రతి మంగళవారం స్థానికులకు అంతరాలయ దర్శనం కల్పిస్తున్న సంగతి తెలిసిందే.

## ఒంగోలులో శిశువు విక్రయం తీవ్ర కలకలం

### బాలల సంరక్షణ కమిటీకి ఫిర్యాదు

**ఒంగోలు:** ఒంగోలులో శిశువు విక్రయం తీవ్ర కలకలం రేపింది. ఒంగోలు రిమ్స్‌లో పది వేలకు కన్న కూతురుని అంగన్వాడీ కార్యకర్త మంజుల విక్రయించినట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా కల్లూరుకి చెందిన బాలసుందరరావుకి మధ్యవర్తుల ద్వారా చిన్నారిని విక్రయించింది. పాపని అమ్మిన తర్వాత అంగన్వాడీ కార్యకర్త రిమ్స్‌లో కనిపించకుండా పోయింది. అంగన్వాడీ కార్యకర్త మంజుల రక్త హీనతతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. విషయం తెలిసిన రిమ్స్ వైద్యులు.. శిశువు విక్రయంపై బాలల సంరక్షణ కమిటీకి ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు పాపను క్షేమంగా తీసుకువచ్చారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వాస్పత్రిలో రోగులు అన్నమోరామచంద్ర అని వేడుకుంటున్న పరిస్థితి ఏర్పడింది. మైలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు భోజనం అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ఇప్పటికే రోగులు అనారోగ్యంతో బాధపడుతుండగా.. ఆహారం కూడా అందించకుండా కాంట్రాక్టర్ కడుపు కాలుస్తున్న పరిస్థితి. మైలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో 33 మంది రోగులకు గత రాత్రి నుంచి డైట్ అందలేదు. ఆహారం అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే గ్యాస్ బండ లేక ఆహారం తయారు చేయలేదంటూ వంట సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని రోగులువాపోతున్నారు. ఆరు నెలల నుంచి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. దీంతో చేసేదేమీ లేక బంధువులే.. ఇంటి వద్ద నుండి భోజనం తెచ్చుకొని రోగులకు పెడుతున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ కాంట్రాక్టర్ స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## సెప్టెంబర్ 1నుంచి రెవెన్యూ సదస్సులు

సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని ఏపీ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. రెవెన్యూశాఖలో ఆన్‌లైన్ ట్యాంపరింగ్, రికార్డుల తారుమారుపై గ్రామస్థాయిలో బాధితుల నుంచి అధికారులు ఫిర్యాదులు తీసుకొని పరిష్కరిస్తారని చెప్పారు. గడిచిన ఐదేళ్లలో రెవెన్యూ పరంగా ప్రజలు అనేక సమస్యల్ని ఎదుర్కొన్నారని అన్నారు. ఈ సభల్లో గ్రామస్థాయి అధికారుల నుంచి కలెక్టర్ వరకు పాల్గొంటారని చెప్పారు.

## ఘనంగా గోకులాష్టమి వేడుకలు

### ఆలయాలకు పోటెత్తిన భక్తులు

**హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు బారులు తీరారు. శ్రీ కృష్ణుడి ఆలయాల ముందు భక్తుల రద్దీ నెలకొంది. హైదరాబాద్‌లో ప్రముఖ ఇస్కాన్ టెంపుల్, హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్, శ్రీ రాధాకృష్ణ దేవాలయం తదితర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చిన్ని కృష్ణయ్యకు ప్రీతిపాత్రమైన పాలు, నెయ్యి, వెన్నె తదితర ఆహారపదార్థాలను నైవేద్యం సమర్పించడానికి క్యూ కట్టారు. తెలంగాణ, ఏపీలోని అన్ని జిల్లాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రముఖులు ఆలయాలబాట పట్టారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయిస్తున్నారు. జిల్లాల్లోనూ పలు ఆలయాల్లో గోకులాష్టమి వేడుకలు నిర్వహించారు.

## రాష్ట్రంలో డెంగీ మరణాలపై నిర్లక్ష్యం

### ఆరోగ్య ఎమర్జెన్సీ ప్రకటించాలని కెటిఆర్ డిమాండ్

**హైదరాబాద్:** రాష్ట్రంలో డెంగీ మరణాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డెంగీ మరణాలు లేవని ప్రభుత్వం చెబుతుంది. కానీ వార్తా పత్రికల్లో మాత్రం ఒక్కరోజులో ఐదు మంది డెంగీతో చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. డెంగీతో మరో ముగ్గురు చనిపోయినట్లు ఇవాళ కూడా వార్తా పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ డేటాను ఎవరు దాచిపెడుతున్నారు..? ఎందుకు దాచిపెడుతున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా మందులు లేవు.. చాలా హాస్పిటల్స్‌లో ఒక్కో బెడ్‌పై ముగ్గురు, నలుగురు ఉండి ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ పరిస్థితిని సీరియస్‌గా పరిగణించి, రాష్ట్రంలో హెల్త్ ఎమ్జర్గ÷న్సీ ప్రకటించాలని సీఎస్ శాంతికుమారికి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ అంటేనే మొండిచేయి చూపడం

### రుణమాఫీపై మరోమారు కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్:** రైతు రుణమాఫీ అంశంలో బీఆర్ఎస్ నేతల ఆరోపణలు ఆగడం లేదు. పూర్తి రుణ మాఫీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్తున్నారు. కానీ రుణమాఫీ ఓ బోగస్ అంటూ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు ఇప్పటికే ఈ పథకంపై అనేక విమర్శలు చేశారు. ఇంకా రైతులకు పూర్తిగా మాఫీ చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతుల ఖాతాల్లో నగదు వేసినట్లు గొప్పలు చెప్పుకుంటుందని మండిపడు తున్నారు. తాజాగా రుణమాఫీ అంశంపై కేటీఆర్ మరోసారి స్పందించారు. రుణమాఫీ అయిన రైతులకన్నా కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. అన్నివిధాలా అర్హత ఉన్నా ఎందుకు మాఫీ కాలేదో చెప్పేవారు లేరంటూ ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ' కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు పంట సీజన్లు గడిచినా రైతుభరోసా ఇంకా షురూ చెయ్యలేదు. జూన్‌లో వేయాల్సిన రైతు భరోసా ఆగస్టు దాటుతున్నా లబ్ధిదారుల ఖాతాల్లో వెయ్యలేదు. కౌలు రైతులకు ఇస్తానన్న రూ.15వేలు ఇంకా ఇవ్వలేదు. వ్యవసాయ కూలీలకు రూ.12వేల హామీ ఇంకా అమలే చెయ్యలేదు. కాంగ్రెస్ అంటేనే మొండి చెయ్యి చూపించే పార్టీ అని మరోసారి తేలిపోయిందని అన్నారు.

## ప్రముఖుల కృష్ణాష్టమి శుభాకాంక్షలు

### గవర్నర్, సిఎం, విపక్ష నేతల అభినందనలు

**హైదరాబాద్:** గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్.. రాష్ట్ర ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణ భగవానుడి కృపా కటాక్షాలు ప్రజలందరికీ అందాలని వారు ఆకాంక్షించారు. ఇందుకు సంబంధించి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'రాష్ట్ర ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు. మానవ జీవితంలో 'గీత' బోధనలు ప్రభావశీలమైనవి. మానవుడి ప్రతి దశలోనూ కృష్ణ భగవానుడు కొలువై ఉంటాడు. ఆ శ్రీకృష్ణ భగవానుడి కృపా కటాక్షాలు ప్రజలందరికీ అందాలని ప్రార్థిస్తున్నా' అని రేవంత్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ హార్దిక శుభాకాంక్షలు!' అని కేసీఆర్ పోస్ట్ చేశారు. ' వసుదేవ సుతం దేవం కంస చాణూర మర్దనమ్. దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్. సమస్త లోక రక్షకుడు యశోదానందనుడు, ధర్మాన్ని స్థాపించి, అధర్మాన్ని, అన్యాయాన్ని అంతం చేసిన పవిత్ర జగద్గురువు అవతార మూర్తి జన్మాష్టమి పర్వదినం. శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ పేర్కొన్నారు. వీరితోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి చెందిన ప్రముఖులంతా సోషల్ మీడియా వేదికగా కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం

### రానున్న రోజుల్లో భారీ వర్షాలకు ఛాన్స్

**హైదరాబాద్:** ఈ నెల 29 నాటికి తూర్పు మధ్య, పరిసర ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పాడే అవకాశం ఉందని.. ఏపీ, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ క్రమంలో తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశాలున్నాయని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. 27న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. 28న ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో వానలు కురుస్తాయని పేర్కొంది. ఈ నెల 29, 30 తేదీల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. ఈ మేరకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# తెలంగాణలో వాతావరణ మార్పులు

## వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాల విజృంభణ

### ఇప్పటికే ఆరుగురు మృత్యువాత






**హైదరాబాద్:** తెలంగాణలో వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. వైరల్ ఫీవర్స్‌తో ఒకే రోజు ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గంగాదేవిపాడు గ్రామంలో ఈడుపుగంటి సామ్రాజ్యం (67) అనే మహిళకు వారం కింద జ్వరం రావడంతో ఆస్పత్రిలో చేరారు. అక్కడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. అటు, ఇదే మండలం బ్రహ్మళకుంటకు చెందిన బానోతు కృష్ణ (50)కు వారం కింద ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో కల్లూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. రెండు రోజుల కిందటే ఇంటికి వచ్చి పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. అలాగే, కామారెడ్డి - సదాశివనగర్ మండలంలోని భూంపల్లికి చెందిన మనస్విని (11)కి జ్వరం రాగా కుటుంబ సభ్యులు కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ తీసుకొస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయింది. అటు, ఇదే కామారెడ్డి - సదాశివనగర్‌లో నరేశ్ (29) అనే వ్యక్తి డెంగీతో మృతి చెందాడు. అలాగే, కరీంనగర్ - ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన నేరెళ్ల ప్రశాంత్ (26) జ్వరంతో ప్రాణాలు కోల్పోయాడు. ఇతను స్థానికంగా చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నాడు. ఈ క్రమంలోనే తీవ్ర అస్వస్థతకు గురి కాగా కరీంనగర్‌కు తీసుకెళు_ండగా మార్గమధ్యలోనే చనిపోయాడు. మరోవైపు, మహబూబాబాద్ - కొత్తగూడ మండలం హనుమాన్ తండాలో రాజేందర్, సంధ్య దంపతులు హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ దంపతులు కుమార్తెకు 5 రోజుల కిందటే జ్వరం వచ్చి తగ్గింది. స్వగ్రామంలో పని ఉందని కూతురితో కలిసి వెళు_ండగా.. దారిలో జ్వరం ఎక్కువై ఫిట్స్ వచ్చింది. ఈ క్రమంలోనే ఆమెను నర్సంపేటకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే చనిపోయినట్లు తల్లిదండ్రులు తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాలతో రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఇదే అదనుగా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ప్రతి జ్వరాన్ని డెంగీ అని చెప్పి చికిత్స కోసం భారీగా వసూలు చేస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. 'డెంగీ ఉదయం పూట కుట్టే ఏడిస్ దోమల ద్వారా వ్యాపించే ఓ సాధారణ జ్వరం. ఇది కార్పో వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుంది. తీవ్ర జ్వరం, తలనొప్పి, కంటి లోపలి భాగం నొప్పి, వాంతులు, విరేచనాలు, కండరాలు, కీళ్లనొప్పులు, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు కన్పిస్తాయి. ప్లేట్ లెట్స్ సంఖ్య తగ్గుతుంది. అవి 20 వేలకు తగ్గినా ఇబ్బంది ఉండదు. తిరిగి అవే వృద్ధి చెందుతాయి. ప్రస్తుత సీజన్‌లో జ్వరాలతో ఎక్కువ మంది ఆస్పత్రులకు వస్తున్నారు. మరికొందరు నిర్లక్ష్యంతో సొంత వైద్యం చేసుకుంటున్నారు. అలా కాకుండా లక్షణాలు కన్పించిన వెంటనే వైద్యున్ని సంప్రదిస్తే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.' అని వైద్యాధికారులూ సూచించారు. మరోవైపు, రాష్ట్రంలో డెంగీ, విష జ్వరాల విజృంభణపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. 'రాష్ట్రంలో డెంగీ మరణాలు లేవని ప్రభుత్వం చెబుతోంది. కానీ ఒక్కరోజులో 5 మంది డెంగీతో చనిపోయినట్లు వార్తాకథనాలు పేర్కొంటున్నాయి. ఈ డేటాను ఎవరు ఎందుకు దాచిపెడు తున్నారని ట్విట్టర్ వేదికగా కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా మందులు లేవని.. చాలా ఆస్పత్రుల్లో ఒక్కో బెడ్‌పై ముగ్గురు, నలుగురు ఉండి ట్రీట్మెంట్ తీసుకుంటున్నారని అన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

# దమ్ముంటే పాతబస్తీ ఆక్రమణలు కూల్చేయండి

## సిఎం రేవంత్‌కు మహేశ్వర రెడ్డి సవాల్

### ప్రజా సమస్యలు పక్కదారి పట్టించే చర్యని విమర్శలు




**హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డికి దూకుడు ఎక్కువ అని బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డి అభిప్రాయ పడ్డారు. ఆ దూకుడుతనమే ఇబ్బందిగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. దాంతోపాటు పాతబస్తీలో చెరువులు కబ్జాకు గురయ్యాయని మహేశ్వరరెడ్డి గుర్తుచేశారు. ఆ కబ్జాలు తొలగించే దమ్ము సీఎం రేవంత్ రెడ్డికి ఉందా అని నిలదీశారు. చెరువు కబ్జా చేసి ఓవైసీ కాలేజీ నిర్మించారని గుర్తుచేశారు. ఆ కాలేజీని కూలుస్తారా అని అడిగారు. మజ్లిస్ పార్టీతో కాంగ్రెస్ సఖ్యంగా ఉంటోంది. ఈ క్రమంలో ఓవైసీ కాలేజీని కూలగొడతారా అని మహేశ్వర రెడ్డి ఛాలెంజ్ చేశారు. హైడ్రాకు అంత హైప్ తీసుకొచ్చేందుకు కారణం ఇతర అంశాలు పక్కదారి పట్టించేందుకేనని మహేశ్వర రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. కూల్చివేతల గురించి జనం చర్చించు కుంటుంటే.. ఇతర అంశాల గురించి మాట్లాడే అవకాశం ఉండదని వివరించారు. ప్రజా సమస్యలు పక్కదారి పట్టించేందుకే హైడ్రాను తెరపైకి తీసుకొచ్చారని మండిపడ్డారు. రుణమాఫీ కాక రైతులు ఇబ్బంది పడ్డారని మహేశ్వర రెడ్డి గుర్తుచేశారు. రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తలొక విధంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో రుణమాఫీ అయ్యింది ఎంత..? ఇంకా ఎంతమందికి రుణం మాఫీ చేయాల్సి ఉందని మహేశ్వర రెడ్డి నిలదీశారు. రూ.31 వేల కోట్లు మాఫీ చేశామని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారు. మంత్రులేమో రూ.17 వేల కోట్లు మాఫీ చేశామని అంటున్నారు. ఈ రెండు ప్రకటనల్లో ఏది నిజం..? ఎవరి మాటలను నమ్మాలని నిలదీశారు. మంత్రివర్గంలో ఓ ఫేక్ మంత్రి ఉన్నారని సంచలన ఆరోపణలు చేశారు.




## సిఎం రిలీఫ్ ఫండ్ దుర్వినియోగం

### 17 ఆస్పత్రులపై సీఐడీ కేసులు నమోదు

**హైదరాబాద్:** సీఎంఆర్ఎఫ్ స్కాంలో 17 ఆస్పత్రులపై సీఐడీ కేసులు నమోదు చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, కరీంనగర్, మహబూబ్‌బాద్‌లో ఉన్న హాస్పటల్స్‌పై కేసులు నమోదు అయ్యాయి. ఈ ఆస్పత్రులు ఫేక్ బిల్లులు పెట్టి ÷-లక్లైమ్ చేసుకున్నట్లు విచారణలో బయటపడింది. వెరిఫికేషన్‌లో హాస్పిటళ్ల బాగోతం బట్టబయలైంది. గతంలో ఇదే స్కాంలో నలుగురిని సీపీఎస్ పోలీసులు అరెస్ట్ చేసి విషయం తెలిసిందే. రెండు హాస్పిటల్స్ నుంచి 6 లక్షల ఫేక్ బిల్లులను ఆస్పత్రుల నిర్వాహకులు ÷-లక్లైమ్ చేసుకున్నారు. వీరిపై ఫోర్జరీతో పాటు చీటింగ్ కేసులు నమోదు అయ్యాయి. రాష్ట్రంలో సీఎంఆర్ఎఫ్ కుంభోణం తీవ్ర సంచలనం రేపుతోంది. రోగులకు ట్రీట్మెంట్ అందించకుండానే నకిలీ బిల్లులతో సీఎంఆర్ఎఫ్ నిధులను డ్రా చేసుకున్న పలు ఆస్పత్రులు బాగోతాన్ని సీఐడీ గుర్తించింది. రోగులు లేకుండా, వైద్యం చేయకుండా.. కేవలం కాగితాల్లోనే పెద్ద జబ్బులున్నట్లు పేర్కొంటూ తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో సీఎంఆర్ఎఫ్ నిధులను డ్రా చేస్తున్నారంటూ గత ఏడాది రెవెన్యూ శాఖ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ స్కాం బయటపడింది. ఈ స్కామ్‌లో ఆసుపత్రుల సిబ్బంది, లోకల్ లీడర్లు, అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వం హయాంలో జరిగిన కుంభకోణం వెలుగులోకి రావడంతో.. సీఎం రేవంత్ రెడ్డి సీఐడీ విచారణకు ఆదేశించారు. మొత్తం 17 ఆస్పత్రులపై సీఐడీ కేసులు నమోదు చేసింది.

# అవినీతికి పాల్పడే పోలీసులపై చర్యలు

## అవసరమైతే ఉద్యోగాల నుంచి తొలగిస్తాం

### హైదరాబాద్ సిపి కఠిన హెచ్చరికలు

**హైదరాబాద్:** లంచాలు, వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. అవినీతికి పాల్పడినట్టు రుజువైతే ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగిస్తామని తేల్చి చెప్పారు. పలుమార్లు హెచ్చరించినప్పటికీ తీరుమారని అధికారులపై నిఘా పెడతామని వివరించారు. మసాజ్ సెంటర్లు, చిరు వ్యాపారుల, పాన్ షాపుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడొద్దని హైదరాబాద్ సీపీ శ్రీనివాస రెడ్డి సూచించారు. హైదరాబాద్ పోలీసులపై అవినీతి ఆరోపణలు రావడంతో ఈ మేరకు సీపీ స్పందించారు. అవినీతికి పాల్పడిన వారిని గుర్తించి సర్వీస్ నుంచి తొలగిస్తామని వార్నింగ్ ఇచ్చారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి అవినీతి ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఆ క్రమంలోనే పోలీసుల అవినీతి ఆరోపణలపై సీపీ ఘాటుగా స్పందించారు. సస్పెండ్ చేయడం అంటూ ఉండదని, సర్వీస్ నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.

# బండ్లగూడ స్కూల్ కూల్చొద్దని వినతి

## కావాలంటే నాపై బుల్లెట్ల వర్షం కురిపించండి

### హైడ్రా చర్యలపై అక్బరుద్దీన్ సంచలన వ్యాఖ్యలు




**హైదరాబాద్:** హైడ్రాపై మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. బండ్లగూడలో గల ఫాతిమా ఓవైసీ కాలేజీని హైడ్రా కూల్చివేస్తుందనే వార్తలపై స్పందించారు. చెరువు కబ్జా చేసి ఓవైసీ బ్రదర్స్ స్కూల్ నిర్మించారని హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. ఆ క్రమంలో అక్బరుద్దీన్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'కావాలంటే నాపై మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి. ఆ స్కూల్ కూల్చకండి. పేదలకు ఉచిత విద్య అందించేందుకు 12 బిల్డింగులు నిర్మించా. వీటిని కావాలని కొందరు తప్పుగా చూపిస్తున్నారు. గతంలో నాపై కాల్పులు జరిగాయి. కావాలంటే మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి. కత్తులతో దాడి చేయండి. పేదల విద్యాభివృద్ధి కృషికి అడ్డుపడకండి అని అక్బరుద్దీన్ సూచించారు. హైదరాబాద్ పరిసరాల్లో ఇతరులు కబ్జా చేసిన భూముల గురించి ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రతిపక్ష నేతలు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. సీఎం రేవంత్.. మీకు దమ్ముంటే ఆ నిర్మాణాలు కూల్చివేయాలని ఓపెన్ ఛాలెంజ్ చేస్తున్నారు. పాతబస్తీలో చెరువులు కబ్జాకు గురయ్యాయని బీజేఎల్పీ నేత మహేశ్వరరెడ్డి గుర్తుచేశారు. ఆ కబ్జాలు తొలగించే దమ్ము సీఎం రేవంత్ రెడ్డికి ఉందా అని అడిగారు. చెరువు కబ్జా చేసి ఓవైసీ కాలేజీ నిర్మించారని గుర్తుచేశారు. ఆ కాలేజీని కూలుస్తారా అని అడిగారు. మజ్లిస్ పార్టీతో కాంగ్రెస్ పార్టీ సఖ్యంగా ఉంటోంది. ఈ క్రమంలో ఓవైసీ కాలేజీని కూలగొడతారా అని మహేశ్వర రెడ్డి ఛాలెంజ్ చేశారు. మహేశ్వర రెడ్డి కామెంట్ చేశారో లేదో.. ఆ వెంటనే అక్బరుద్దీన్ ఓవైసీ స్పందించారు. దయచేసి ఆ స్కూల్ కూల్చొద్దు అని కోరారు. పేద విద్యార్థుల ఆ పాఠశాల వరం లాంటిదని కోరారు. కొందరు కావాలనే తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ వైరంతో తాము నిర్మించిన స్కూల్ కూల్చాలని కోరడం సరికాదు. వేలాది మంది విద్యాబుద్ధులు నేర్చుకునే స్కూల్ నేలమట్టం అయితే వారి బంగారు భవిష్యత్ నాశనం అవుతుందని అభిప్రాయ పడ్డారు. కావాలంటే నన్ను టారగెట్ చేయండి.. అవసరమైతే బుల్లెట్ల వర్షం కురిపించాలని అక్బరుద్దీన్ కోరారు. కొందరు మాపై కక్షగట్టి మరి నోటీసులు ఇస్తున్నారు. మా విద్యా సంస్థలను కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకవేళ కూల్చినా కుతుబ్‌మినార్ కంటే ఎత్తైన భవనాలు నిర్మిస్తాం. 40 వేల మంది విద్యార్థులకు ఉచితవిద్య అందజేస్తున్నాం. నాపై కక్ష ఉంటే నన్ను కాల్చండి.. నాపై దాడులు చేయండి.